క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

కోరుట్ల : అలయన్స్ క్లబ్ 2023–24 నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అల్లై పాటిల్ ధరందీప్, కార్యదర్శిగా అల్లై గోనె శ్రీహరి, ట్రెజరర్‌గా అల్లై కటుకం మల్లికార్జున్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా గవర్నర్ అల్లై డి. వేణు కుమార్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని ఇంటర్నేషనల్ అడ్వైజర్ అల్లై కటుకం రాజేంద్ర ప్రసాద్, జిల్లా ఉప గవర్నర్ అల్లై కటుకం సురేందర్, అలయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

కథలాపూర్: మేడిపెల్లి మండలం దమ్మన్నపేటలో అలయన్స్ క్లబ్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా తొగరి లక్ష్మిపతి, కార్యదర్శిగా అల్లై రమేశ్, కోశాధికారిగా రాచర్ల హన్మాండ్లు, జోన్ చైర్మన్‌గా బండ్ల గజానందం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గసభ్యులను సన్మానించారు. అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సలహాదారుడు కట్కం రాజేంద్రప్రసాద్, జిల్లా ఉప గవర్నర్ కట్కం సురేందర్, సభ్యులు ఏనుగు రమేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, బండ్ల నరేశ్, బండ్ల మురళి, పాడేటి దిలీప్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మల్లాపూర్ : మండల కేంద్రానికి చెందిన ఆకుతోట గంగమణి ఈనెల 28న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి గురువారం 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కనుక సంజీవ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఇక్కడ లయన్స్ క్లబ్ సభ్యులు ముత్యాల రమేశ్, గడ్డం (క్లెం) శ్రీనివాస్ రెడ్డి, క్యాతం సురేశ్ రెడ్డి, ప్రజాసంఘాల జేఏసీ మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి లక్ష్మణ్, నాయకులు మాట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహేంద్ర మేదరి సంఘం అధ్యక్షుడిగా లక్ష్మీ నర్సయ్య



లక్ష్మీ నర్సయ్య

రాయికల్: పట్టణ మహేంద్ర మేదరి సంఘం అధ్యక్షుడిగా ఊరడి లక్ష్మీనర్సయ్య ఎన్నికైనట్లు గురువారం మండల అధ్యక్షుడు సిలివేరి సురేశ్ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఊరడి చిన్నరాజం, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల మల్లయ్య, కోశాధికారిగా ఇందూరి రాజు, గౌరవ సలహాదారులుగా సిలివేరి గంగరాం ఎన్నికైనట్లు తెలిపారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సహాయక బృందం సభ్యులు

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామం నివేదిత వృద్ధాశ్రమంలోని 20 మంది వృద్ధులకు గురువారం జిల్లా సహాయక బృందం సభ్యులు మన్నెగూడెంకు చెందిన కొండ రాధ జ్ఞాపకార్థం దుస్తులతో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కొడిమ్యాల శేఖర్, పాలిక రాజశేఖర్, కొత్తపల్లి మహేశ్, రాజేశ్, తాటిపాముల రవి, సంతు, పంచతి అరవింద్ పాల్గొన్నారు.

ఉపాధి రంగాల్లో రాణించేలా సహకారం



మాట్లాడుతున్న గోలి మోహన్

కథలాపూర్: గ్రామాల్లో యువత ఉపాధి రంగాల్లో రాణించేలా సహకరిస్తామని ఆద్య గోలి ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నియోజకవర్గ నేత గోలి మోహన్ పేర్కొన్నారు. గురువారం బీమారం మండలం కమ్మరిపేటలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చదువుకున్న యువత ఉపాధిలేక గ్రామాల్లోనే ఉంటున్నారని, రైతులకు పంటలసాగుపై అవగాహన కల్పించకపోవడంతో గిట్టుబాటు ధరలు రాని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. నాయకులు లక్ష్మణ్, గంగారెడ్డి, పోకతోట రాజం, మల్లేశం పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి

- గ్రామ పంచాయతీలు, మండల కార్యాలయాల్లో వసతులు కరువు
- ఇబ్బంది పడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు
- మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని అధికారులకు వేడుకోలు



మరుగుదొడ్ల వసతి లేని స్వశక్తి, వ్యవసాయశాఖ కార్యాలయం

కథలాపూర్: స్థానిక సంస్థల్లో మహిళలకు యాభై శాతం సీట్లు కేటాయిస్తున్నా పాలనా వ్యవహారాలు నిర్వహించే పంచాయతీలు, మండల కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రజాప్రతినిధులు ఇబ్బందులు తప్పడం లేదు. స్వచ్ఛభారత్‌లో ఇంటింటికే కాదు.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనూ విధిగా మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశాలున్నా మండలంలో రెండు, మూడు గ్రామాల్లో మినహా మిగతా గ్రామాల్లో అమలుకు నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మండలంలో 19 గ్రామాలు

మండలంలో 19 గ్రామాలుండగా మహిళా సర్పంచులు 11 మంది, ఏడుగురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు 96 మంది ఉన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి అధికారుల వరకు బహిరంగ రహిత మల మూత్ర విసర్జన (ఓడీఎఫ్) గ్రామంగా రూపొందించాలని చెబుతారు. అధికారుల కార్యాలయాల్లో మాత్రం మరుగుదొడ్లు నిర్మించడం లేదు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే మహిళలకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. పంచాయతీ, మండలస్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల ఇబ్బందులు..

పంచాయతీ కార్యాలయాలతోపాటు వివిధ మండల కార్యాలయాల్లో శాఖలవారీగా సమావేశాలు నిర్వహించడం సహజం. ఇందులో వార్డుసభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, గ్రామస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, సెర్ప్ మహిళలు పాల్గొంటారు. ఒక్కోసారి సమావేశాలు మూడు, నాలుగు గంటలపాటు నిర్వహిస్తారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి అన్ని గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలతోపాటు ప్ర భు త్వ కార్యాలయాలు, వివిధ శాఖల మండలకార్యాలయాల్లో మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అన్ని గ్రామాల్లో నిర్మించాలి



మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తున్నామంటారు. స్థానిక సంస్థల్లో యాభై శాతం రిజర్వేషన్లు మహిళలకే కేటాయించామని సభల్లో, సమావేశాల్లో ఆర్భాటంగా చెప్తారు. మహిళలు పాలనా వ్యవహారాలు చూసే కార్యాలయాల్లో ఏళ్లుగా మరుగుదొడ్లు లేని విషయాన్ని గుర్తించలేదు. అధికారులు దృష్టిసారించి అన్ని గ్రామాల్లో, మండలశాఖ ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించాలి.

– పులి శిరీష, ఎంపీటీసీ, పోతారం

ప్రభుత్వం దృష్టి సారించాలి



ఇంటింటా మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచా రం చేశారు. కానీ గ్రామాలకు ప్రధానమైన గ్రామ పంచాయతీలు, మండలస్థాయి ప్రభు త్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు నిర్మించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లతో పాటు కనీస వసతులు కల్పించేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించాలి.

– ప్రవీణ్‌గౌడ్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, తాండ్ర్యాల

ఎస్ఎఫ్‌సీ నిధులతో నిర్మించవచ్చు



గ్రామ పంచాయతీలు ఎస్ఎఫ్‌సీ నిధులతో మరుగుదొడ్లు నిర్మించవచ్చు. మండల కార్యాలయాల్లో ఆ శాఖల మెయింటనెన్స్ నిధుల నుంచి మరుగుదొడ్లు నిర్మించుకోవాలి. గ్రామ పంచా య తీ కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ కా ర్యాలయాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు లే కుంటే వాటి వివరాలు సేకరిస్తాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించేలా చూస్తాం.

– జనార్దన్, ఎంపీడీవో, కథలాపూర్



ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



రాయికల్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బతికపల్లిలో ముస్లిం నాయకులు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

జగిత్యాల రూరల్ /కోరుట్ల /ధర్మపురి/ రాయికల్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/ మెట్‌పల్లి/ మల్యాల/ సారంగాపూర్/మల్లాపూర్ : జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో గురువారం బక్రీద్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఈద్గాలు, మసీదుల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, పలు వురు నాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ముస్లిం నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడికి జీవం



తొంబర్రావుపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

- మూతపడే స్థాయి నుంచి కళకళలాడుతున్న పాఠశాల
- చిన్నారులను ప్రైవేట్ స్కూళ్లకు పంపించొద్దని గ్రామస్తుల నిర్ణయం
- ఆదర్శంగా తొంబర్రావుపేట ప్రభుత్వ పాఠశాల

కథలాపూర్(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన అందించడంతో తమ చిన్నారులను తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు ముందుకువస్తున్నారు. ఇందుకు నిదర్శనం మేడిపెల్లి మండలం తొంబర్రావుపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. గ్రామంలోని ప్రాథమిక స్థాయి విద్యార్థులందరినీ ప్రభుత్వ బడిలోనే చేర్పిస్తున్నారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2014–15 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 11 మంది విద్యార్థులే ఉన్నారు. బడి మూతబడే అవకాశం ఉండటంతో గ్రామస్తులు సమావేశమై చర్చించుకున్నారు. గ్రామంలోని చిన్నారులను ప్రైవేట్ పాఠశాలలకు పంపించవద్దని, ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని 2015లో గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. గ్రామస్తులు నిర్ణయంతో తీసుకోవడంతో అప్పటినుంచి విద్యార్థుల సంఖ్య పెరిగింది. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులే టీచర్లను నియమించి వారికి వేతనాలు చెల్లిస్తుండటం విశేషం.

కొత్తగా 24 మంది విద్యార్థులు..

తొంబర్రావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం కొత్తగా 24 మంది విద్యార్థులు చేరారు. దీంతో ఆ పాఠశాల 104 మంది విద్యార్థులతో కళకళలాడుతుంది. 'మన ఊరు– మన బడి' కింద పాఠశాలకు రూ. 24 లక్షలు మంజూరయ్యాయి. వీటితో తాగునీటి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. తరగతి గదులకు రంగులు వేయించారు. పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇద్దరే ఉండగా గ్రామాభివృద్ధి కమిటీ తరుపున ముగ్గురిని ప్రైవేట్‌గా నియమించారు. విద్యార్థుల సంఖ్య బట్టి మరో నలుగురు ఉపాధ్యాయులు అవసరమని గ్రామస్తులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు దృష్టిసారించి విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



డ్యూయల్ డెస్కులపై కూర్చున్న విద్యార్థులు

గ్రామస్తుల సహకారంతో..



పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అందించారు. విద్యార్థులంతా ప్రభుత్వ పాఠశాలలో చదవాలని గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. పాఠశాలల్లో వసతుల కల్పన, తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించేందుకు గ్రామస్తులే ఆర్థిక సహకారం అందించడం ఆనందంగా ఉంది. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు కృషి చేస్తున్నాం.

– రాజేందర్‌రావు, పాఠశాల హెచ్ఎం, తొంబర్రావుపేట

అభివృద్ధి పనులు చేపట్టాలి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- పలు అభివృద్ధి పనుల పరిశీలన



జగిత్యాల : పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: అభివృద్ధి పనులను వెనువెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పట్టణం గతంలో కంటే ఎంతో అభివృద్ధి జరిగిందని, జగిత్యాలలో జోన్ల మార్పిడితో పాటు, 4,500 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం, రూ.200 కోట్లతో మెడికల్ కళాశాల భవనం, రూ.36 కోట్లతో మిషన్ భగీరథ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆయనవెంట కౌన్సిలర్లు నారాయణ రెడ్డి, క్యాదాసు నవీన్, కూతురు రాజేశ్, చుక్క నవీన్, జగదీశ్, కేసరిబాబు, సమిండ్ల శ్రీనివాస్, మహేశ్, రామకృష్ణ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు

నిరుపేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. 14 మంది నిరుపేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేశారు. నియోజకవర్గంలో పేదలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నారని, సేవా దృక్పథంతోనే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ విజయ్, కౌన్సిలర్ కూతురు రాజేశ్, శివకేసరి బాబు పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరనిలోటు

తెలంగాణ ఉద్యమంలో గాయకుడిగా అందరి మన్ననలు పొందిన సాయిచంద్ మృతి తీరనిలోటని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

రాయికల్: మండలంలోని మైతాపూర్‌కు చెందిన రాయి వెంకటేశ్‌కు వెన్నుముక సమస్యతో బాధపడుతుండగా చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందజేశారు. ఇక్కడ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజిరెడ్డి, నాయకులు మోర వెంకటేశ్, మహేశ్, రత్నాకర్ రావు, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏఎంసీ పాలకమండలి సభ్యులు

మండల ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన మారంపల్లి రాణి, ఏఎంసీ పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలకమండలి సభ్యులను అభినందించారు. ఇక్కడ జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, పాలకమండలి సభ్యులు అత్తినేని సాయిరెడ్డి, వెంకటేశ్, రాజన్న, ఉడుత నందయ్య, సూర విజయ్, కోల రాజు, రమేశ్, పాపయ్య పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే బీజేపీ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుకర్

కథలాపూర్: పేద ప్రజల సంక్షేమమే బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరండ్ల మధుకర్ పేర్కొన్నారు. గురువారం బీమారం మండలం గోవిందారంలో మహజన్ సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలపై ఇంటింటా వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. దేశంలో అవినీతి లేని పాలన అందించడం ప్రధాని మోడీకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దురిశెట్టి సత్యనారాయణ, నాయకులు రాగిటి గంగాధర్, బిట్కు రవీందర్, చిన్నరాజు, దశరథం, భూమలింగం, నరేశ్, వెంకటేశ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉండాలి



మహాలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పొలస్తేశ్వర స్వామి ఆలయంలో పూజలు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జగిత్యాలటౌన్ : మహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హిందూవుల పండుగలు ఏకాదశితోనే ప్రారంభమవడం పండుగ ప్రత్యేకత అన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు నారాయణరెడ్డి, క్యాదాసు నవీన్, కూతురు రాజేశ్, చుక్క నవీన్, బొడ్ల జగదీశ్, ఆవారి శివకేసరి బాబు, నాయకులు సమ్మిళ్ల శ్రీనివాస్, రంగు మహేశ్, రామకృష్ణ తదితరులున్నారు.

పెగడపల్లి మండలంలో..

పెగడపల్లి: మండలంలో తొలి ఏకాదశి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పెగడపల్లి, వెంగళాయిపేట శివాలయాలు, నంచర్ల, ఎల్లాపూర్, అయితిపల్లి, నామాపూర్ గ్రామాల్లోని శ్రీ సీతారామ చంద్ర స్వామి, బతికపల్లి కొచ్చెరువు గుట్ట హన్మాన్ ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు ఆలయాలను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

పొలస్తేశ్వరస్వామి ఆలయంలో..

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని శ్రీ పొలస్తేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీపూర్ వెంకటేశ్వరస్వామి దేవాలయం, తిమ్మాపూర్ చిన్నగుట్టు ఆంజనేయ స్వామి ఆలయం, పొరండ్ల రామలింగేశ్వరస్వామి దేవాలయంలో వేడుకలు నిర్వహించారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో..

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ప్రజలు తొలిఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయం, బీర్‌పూర్ శ్రీలక్ష్మీ నృసింహ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సాయిచంద్ మృతిపట్ల సంతాపం

కథలాపూర్: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మృతిపట్ల మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం సంతాపం తెలిపారు. గాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఆయన సేవలను గుర్తుచేస్తూ వారు మౌనం పాటించారు. ఇక్కడ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జెడ్పీటీసీ భూమయ్య, గుండారపు గంగాధర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, కొండ ఆంజనేయులు, కల్లెడ శంకర్, నాంపెల్లి లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

'ఆజాద్‌పై దాడి సరికాదు'

జగిత్యాల: బహుజన నేత, భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని భీం ఆర్మీ జిల్లా అధ్యక్షుడు సాగర్ అన్నారు. వెంటనే నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.